క్లుప్తంగా

అడ్మిషన్లు ప్రారంభం

ధన్వాడ: తెలంగాణ మోడల్ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉమాదేవి కోరారు. నేటి నుంచి తెలంగాణ మోడల్ పాఠశాల వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, అనంతరం పాఠశాలలో సంబంధిత ధృవ పత్రాలను అందజేయాలని సూచించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఊట్కూరు: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవానీ మందిర్ కల్యాణ మండపం, పంచమ సీడ్ దగ్గర దుకాణాల సముదాయం, ఊర లక్ష్మమ్మ దేవాలయం వద్ద షెడ్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు అరవిందకుమార్, గరిడినింగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాసిర్‌ఖాన్, జెమ్మీర్‌అలీ, ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత



మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు హిందూ ఐక్య ఫౌండేషన్, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. తమ ట్రస్ట్ తరపున కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఉచిత నోట్ పుస్తకాలు, పరీక్షల సమయంలో పెన్నులు, ప్యాడ్స్ అందజేస్తామని ట్రస్ట్ నిర్వాహకుడు అనిల్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దత్తాత్రి, రాజు, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

నీట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థికి అభినందన



కొండన్ వినయ్

ఊట్కూరు: మండల కేంద్రానికి చెందిన చెందిన కొండన్ వినయ్ నీట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. 720 మార్కులకు గాను 502 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా గురువారం గ్రామస్తులు విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఉన్నత చదువులు చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

గౌరవ వేతనం అందజేత



నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో వేసవిలో పాఠాలు బోధించిన వలంటీర్లకు ఒక్కరికి రూ. 2వేల చొప్పున గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయరాములుశెట్టి, ఎంపీడీఓ రమేషకుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు నర్సిములు, రోజా, వలంటీర్లు నసీమా, జయ, ఈశ్వర్, అనిత, మహేందర్, శివ, స్రవంతి, సంతోష తదితరులున్నారు.

మార్కెట్‌లో లావాదేవీలు నిల్

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో గురువారం ఎలాంటి లావాదేవీలు కాలేదు. ధాన్యం సీజన్ ముగియడంతో రైతులు మార్కెట్‌కు అమ్మకానికి తేవడం లేదు. దీంతో ఈ–నామ్ టెండర్లను నిలిపి వేశారు.

వసతిగృహాల్లో నాణ్యమైన భోజనం

అమరచింత: ప్రభుత్వ ఎస్సీ వసతిగృహాల్లోని విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎస్సీడీఓ మల్లేషం అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ వసతిగృహాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్నానపు గదులు, తరగతి గదులు, విశ్రాంతి గదులను పరిశీలించారు. విద్యుత్, తాగునీటి సరఫరా గురించి వార్డెన్ బెనర్జీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠ్య, రాత పుస్తకాలు, బ్యాగులు సరఫరా చేసిందని.. వీటిని ఆయా వసతిగృహాలకు తరలించామన్నారు. జిల్లావ్యాప్తంగా 16 ఎస్సీ విద్యార్థి వసతిగృహాలు, 4 కళాశాల వసతిగృహాలు, 4 పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయని వెల్లడించారు. గత విద్యాసంవత్సరం 2,200 మంది విద్యార్థులు వసతిగృహాల్లో ఉండి చదువుకున్నారని.. పదోతరగతి ఉత్తీర్ణులైన 269 మంది విద్యార్థులు వసతి హాల నుంచి వెళ్లిపోయారని వివరించారు. ప్రవేశాల్లో 75 శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీలకు, 9 శాతం బీసీలు, 4 శాతం ఓసీలకు అవకాశం ఉంటుందని.. జిల్లాలోని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాగనూర్‌లో..



ముడుమాల్‌లో..



ఊట్కూరులో..



మరికల్‌లో గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

‘పల్లె ప్రగతి’తో గ్రామాల అభివృద్ధి

మక్తల్: గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములవుదామని నారాయణపేట జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వనజమ్మ, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో భగువాన్‌పల్లి, అంకెన్ పల్లి గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవం, వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం దాదాన్‌పల్లిల్లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం, రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు జెడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే భూమి చేసి ప్రారంభించారు. అంకెన్‌పల్లి గ్రామంలో నర్సరీలో ఏర్పాటు చేసిన వనభోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, డీఏఓ జాన్‌సుధాకర్, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావని, సర్పంచ్‌లు వెంకట్‌రాములు, అంకెన్‌పల్లి సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ అశిరెడ్డి, మాజీ సర్పంచ్ గోవర్దన్‌రెడ్డి, ఏఈ లక్ష్మీనారాయణ, అంజనేయులుగౌడ్, సర్పంచ్ దత్తు, శేఖర్‌రెడ్డి, కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మద్దూరు, కొత్తపల్లిలో పల్లె ప్రగతి ఉత్సవాలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను సర్పంచ్‌లు ఎగురవేశారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆడారు. పెదిరిపాడ్‌లో

ఎంపీడీఓ విజయలక్ష్మి, వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి పంచాయతీ కార్మికులకు సన్మానించారు. నం చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పారిశుద్ధ్య కార్మికులను, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను సర్పంచ్‌లు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరాములుశెట్టి, జెడ్పీటీసీ గౌనిజ్యోతి, వైస్ ఎంపీపీ వీణావతి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపటిన పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారాయని జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మరికల్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు సీసీరోడ్లు, హరితహారం, ఎల్ఈడీ లైట్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డు, రైతు వేదికలు, ఇంటింటికీ మిషన్ భగీరథ, సాగుకు మిషన్ కాకతీయ వంటి ఎన్నో పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. అనంతరం పంచాయతీ మహిళా



భగువాన్‌పల్లిలో పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ వనజమ్మ, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవి, సర్పంచ్ గోవర్ధన్, ఎంపీడీఓ యశోదమ్మ, ఎంపీటీసీలు గోపాల్, సుజాత, శివ, శ్రీనివాస్‌రావు, తిరుపతయ్య, కృష్ణారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ఊట్కూరు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు నిడుగుర్తి, పులిమామిడి, చిన్నపొర్ల, మల్లెపల్లి తదితర గ్రామాల పంచాయతీ కార్యాలయాలను ముస్తాబు చేసి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. క్రీడా మైదానాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, ఎంపీడీఓ కాలప్ప, ప్రత్యేకాధికారి కృష్ణమాచారి, సర్పంచ్‌లు సూర్యప్రకాష్‌రెడ్డి, యశోదమ్మ, మాణిక్యమ్మ, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లె ప్రగతితో గ్రామాలు పురోగతి సాధిస్తున్నాయని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని ముడుమాల్ గ్రామ పంచాయతీ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాయమ్మ, ఎంపీటీసీ సూగమ్మ, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, చెన్నయ్యగౌడ్, చిన్న అశోక్‌గౌడ్, మడుగు వెంకటేష్, వెంకటప్ప, రాఘవేంద్ర, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జాతీయజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ వద్ద జాతీయ పథకం ఆవిష్కరించారు. ధన్వాడ గ్రామ పంచాయతీలో ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులను శాలువతో సన్మానించారు. అలాగే కిష్టాపూర్ గ్రామంలో పల్లెప్రకృతి వనంలో సర్పంచ్ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో వనభోజనం ఏర్పాటు చేశారు.

ఊరూరా పల్లె ప్రగతి దినోత్స వేడుకలు

దామరగిద్ద: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవ సభలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.



కిష్టాపూర్‌లో వనభోజనం చేస్తున్న గ్రామస్తులు



ముస్తాపేట్‌లో..



మద్దూరులోని పెదిరిపాడ్‌లో..



నర్వలోని పెద్దకడ్మూర్‌లో..

వర్షాలు కురవక రైతుల అగచాట్లు



మరికల్‌లో పత్తి విత్తనాలు మొలకెత్తడానికి నీళ్లు పారపెడుతున్న రైతు

మరికల్: మృగశిర కార్తె మధ్య పాదం లోకి వచ్చినా వర్షాలు సకాలంలో కురవకపోవడంతో భూమిలో నాటిన పత్తి విత్తనాలను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు 75 శాతం రైతులు రూ. 25 లక్షల విలువ చేసే పత్తి విత్తనాలను తమ పొలాల్లో నాటినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల కురిసిన మోస్తారు వర్షానికి రైతులు పత్తి విత్తనాలు నాటారు. అప్పటి నుంచి వర్షాలు పడకపోవడంతో విత్తనాలు ఎండిపోయే ప్రమాదం ఉందని తప్పనిసరి పరిస్థితుల్లో నీటి వనరులు ఉన్న రైతులు నీళ్లు పారపెట్టి విత్తనాలు మొల్లకెత్తించేందుకు ప్రయత్నం చేసుకుంటున్నారు. నీటి వనరులు లేని రైతులు మాత్రం ఇప్పటికే ఎకరాకు రూ.15 వేల వరకు నష్టపోయారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి

మక్తల్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని నగర కార్యదర్శి వంశీ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీటి వసతి, మరుగుదొడ్ల వసతి కల్పించాలన్నారు. విద్యాశాఖ అధికారులు అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్, సురేష్, వినయ్, శరణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంశీ

గ్రామసభ నిర్వహించొద్దని వినతి



సర్పంచ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మరికల్: మండలంలోని తీలేర్ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా గ్రామ సభను నిర్వహించొద్దని బీసీ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజు తో కలిసి ఇతర పార్టీల నాయకులు గురువారం సర్పంచ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా ప్రాంగణం, పల్లెప్రకృతి వనం పనులు పూర్తి చేసిన తర్వాతనే గ్రామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఉన్నతాధికారులు కార్యదర్శిపై ఒత్తిడి పెంచి గ్రామసభను నిర్వహించాలనే చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాము, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవి, మల్లప్ప, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మక్తల్: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పర్వతాలు తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారు జామున అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు. మండలంలోని చిన్న గోప్లాపూర్‌లో ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమాని నర్సిములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గోవా మద్యం పట్టివేత



కృష్ణా: మండల సరిహద్దులో గల చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఎక్సైజ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గోవా నుంచి నాలుగు మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్నారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో గుర్తించామని పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఎక్సైజ్ పోలీసులు మల్లన్‌గౌడ్, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

భట్టి విక్రమార్కకు సన్మానం

దేవరకద్ర: కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పుట్టిన రోజు సందర్భంగా పాదయాత్రలో ఉన్న ఆయనను గురువారం సాయంత్రం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌ను కట్ చేయించి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

గ్రామ సమస్యలను పరిష్కరించండి

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి అంటూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట జాతీయ పతాకం ఎగుర వేసి సంబురాలను జరుపుకోవడం వింతగా ఉందన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చలేని పాలకులు ఉత్సవాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఓవర్ హెడ్‌ట్యాంకులను నెలకు ఒకసారైనా శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మోహన్, శంకర్, నరసింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రనాయక్ తండాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

మండలంలోని చంద్రనాయక్‌తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. నెల రోజుల నుండి వీధి దీపాలు వెలగడం లేదని, కరెంటు స్తంభాలు నేల కొరుగుతున్నాయని వాపోయారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు కలుగుతున్నాయని, మిషన్ భగీరథ పైపులు పగిలినా వాటికి మరమ్మతు చేపట్టడం లేదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హనుమంత్ నాయక్, నాగునాయక్, సోమ్లానాయక్, హరీష్ నాయక్, బొజ్జనాయక్, లింగనాయక్, కృష్ణనాయక్, భాగ్యనాయక్ పాల్గొన్నారు.



చంద్రప్పతండాలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

ప్లాస్టిక్ వాడితే చర్యలు

ఆత్మకూర్: వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం పురపాలిక కార్యాలయంలో మటన్, చికెన్, కూరగాయలు, పండ్ల వ్యాపారులతో సమావేశమయ్యారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకం అధికం అయిందని, దీని కారణంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లడంతో ఎన్నో రకాల అనర్థాలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మటన్, చికెన్ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడే పారబోస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని మండిపడ్డారు. వ్యర్థాలను చెత్తబండ్లకే ఇవ్వాలని, ప్లాస్టిక్ వాడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

నేడు పట్టణ ప్రగతి..

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరణ, ముగ్గుల పోటీలు, ప్రగతి నివేదిక, ర్యాలీ, కార్మికులకు సన్మానం తదితర కార్యక్రమాలు శుక్రవారం చేపడుతున్నామని, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని చైర్‌పర్సన్ గాయత్రి కోరారు.

దేశానికే తెలంగాణ అభివృద్ధి ఆదర్శం

దేవరకద్ర రూరల్: పదేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం బస్వాయపల్లి, గోపన్‌పల్లిలో నిర్వహించిన పల్లె ప్రగతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. అన్ని గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించబడిన రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ప్రతి పంచాయతీలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం, క్రీడా మైదానాలు, ప్లాంటేషన్, డంపింగ్ యార్డు, వైకుంఠధామాలతో పాటు మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తూ, వార్షిక ఆడిట్లను కూడా ఆన్‌లైన్‌లో చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బస్వాయపల్లిలో ముదిరాజ్, వాల్మీకి కమిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ, ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్వాయపల్లి నుంచి వేముల వరకు మట్టి రోడ్డు వేసేందుదకు భూమి పూజ చేశారు. గోపన్‌పల్లిలో వాల్మీకి కమిటీ హాల్‌ను ప్రారంభించడంతో పాటు యాదవ కమిటీ హాల్, ఆరోగ్య ఉప కేంద్రం, ఎస్సీ కమిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో పంచాయతీ సిబ్బందిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్నపూర్ణ, ఎంపీపీ రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, జెట్టి నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు రజిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.



గోపన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

లీకేజీని సరిచేసిన అధికారులు



రాంనగర్‌లో పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వార్డు నంబర్ 43 పరిధిలోని రాంనగర్‌లో పలు గల్లీలకు మిషన్ భగీరథ పథకం నుంచి కొన్ని నెలలుగా తాగునీరు పూర్తిస్థాయిలో రాకపోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అసలే వేసవికాలంలో ఇంటింటికీ తక్కువగా కొద్దిసేపు మాత్రమే వచ్చి ఆగిపోవడంతో ఇటీవల వారు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. చివరకు ఆయన ఆదేశాల మేరకు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో లీకేజీ అవుతున్న పైపులైన్‌ను మున్సిపల్ అధికారులు సరిచేశారు. మరమ్మతు చేసిన ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఇక నుంచి ఈ వార్డులోని అన్ని గల్లీలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందుతుందని డీఈఈ బెంజిమన్ తెలిపారు.

తెలంగాణచౌరస్తాలో లీకేజీలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో రెడ్‌క్రాస్ భవనం ఎదుట పైపులైన్ లీకవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ లీక్ అవుతున్న నీళ్ల దాదాపు ఒక కాలనీకి సరిపడా వృథాగా పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఎక్స్‌ప్లో ఎదుట లీకయ్యే నీళ్లతో ఓ పెద్ద సైజ్ కుంటగా మారుతుంది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.